
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

మంగళవారం 30 జూలై 2024

నేడు ఏయూకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి

వీసీతో పాటు అధికారులతో సమీక్ష

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి):

ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్‌కుమార్ గౌర్ మంగళవారం ఆంధ్ర యూనివర్సిటీకి రానున్నారు. వీసీతో పాటు ఇతర అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు. సౌరబ్‌కుమార్ రాక నేపథ్యంలో హెచ్‌వోడీలు, ఫ్యాకల్టీ, ఇతర సిబ్బంది ఉదయం 8.30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అందుబాటులో ఉండాలని ... మిగతా 8వ పేజీలో



వరదనీటితో ఉరకలు వేస్తున్న గాదిగుమ్మి జలపాతం

'గాదిగుమ్మి' సోయగం

మండలంలో కినపర్తి పంచాయతీ వలసంపేట సమీపంలో గాదిగుమ్మి జలపాతం వరద నీటితో ఉరకలేస్తోంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎత్తైన రాయి పైనుంచి జాలువారుతున్న నీటిని చూసి చూపరులు మైమరచిపోతున్నారు. -కొయ్యూరు

పచ్చని సౌందర్యం.. ఏజెన్సీ సొంతం



పాడేరు మండలం కొత్తాబు, కురిడిమెట్ట గ్రామాల చెంతన పచ్చదనం

ఏజెన్సీలో వర్షాలు కురుస్తుండడం, గిరిజన రైతులు పొలాల్లో వ్యవసాయ పనులు చేస్తుండడంతో కొండల నడుమ గిరి పల్లెల్లో పచ్చదనం పరుచుకుంది. పాడేరు మండలం గబ్బంగి పంచాయతీ కొండల మధ్య ఉన్న కొత్తాబు, కురిడిమెట్ట గ్రామాల్లో పచ్చదనం చూపరులను ఆకట్టుకుంటున్నది. పాడేరు ఐటీడీఏ కార్యాలయానికి వెనుకన ఉన్న బరిసింగి కొండపై నుంచి పచ్చదనం చిత్రాన్ని 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో బంధించింది. -ఆంధ్రజ్యోతి/పాడేరు



పాడేరులో నాబార్డు డీడీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీజీఎం గోపాల్

సంప్రదాయ జీవనోపాధి మెరుగుకు చర్యలు

నాబార్డు రీజియన్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎంఆర్.గోపాల్

పాడేరులో డీడీఎం కార్యాలయం ప్రారంభం

పాడేరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి):

గిరిజనుల సంప్రదాయ జీవనోపాధిని మరింతగా మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు నేషనల్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ బ్యాంకు(నాబార్డు) హైదరాబాద్ రీజియన్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎంఆర్.గోపాల్ అన్నారు. సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన నాబార్డు డీడీఎం కార్యాలయాన్ని ఆయన ... మిగతా 8వ పేజీలో

విలేజ్ క్లినిక్‌లకు గూడు కరవు

- నిధుల్లేక పూర్తి కాని భవనాలు
- ఏజెన్సీవ్యాప్తంగా 121 మంజూరు..
- పూర్తయినవి మూడు మాత్రమే..
- వేర్వేరు దశల్లో 50 భవనాలు
- క్లినిక్‌లు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయనేది అనుమానమే

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

సచివాలయ స్థాయిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైసీపీ ప్రభుత్వం ప్రారంభించిన విలేజ్ క్లినిక్ భవన నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. ఏజెన్సీ వ్యాప్తంగా 121 భవనాలకు ఇప్పటికి కేవలం మూడు మాత్రమే పూర్తయ్యాయి. మిలిగినవి వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయి.

ఏజెన్సీ 11 మండలాల్లో 122 గ్రామ సచివాలయాల పరిధిలో 121 విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో దానికి రూ.14.95 లక్షలతో భవనం నిర్మించేందుకు రూ.18.9 కోట్లను ప్రభుత్వం మంజూరుచేసింది. వీటి నిర్మాణాలను 2020లో ప్రారంభించారు. అయితే కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులను ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో నిర్మాణాలు ప్రారంభమై నాలుగేళ్లయినా పూర్తికాని దుస్థితి నెలకొంది.

ముచ్చటగా మూడు మాత్రమే పూర్తి

ఏజెన్సీలో ఇప్పటికి కేవలం మూడు విలేజ్ క్లినిక్‌లు మాత్రమే పూర్తయ్యాయి. వీటిపై గత

మన్యంలో విలేజ్ క్లినిక్ భవనాల వివరాలు

మండలం	మొత్తం	పూర్తయిన భవనాలు
అనంతగిరి	14	0
అరకులోయ	8	0
డుంబ్రిగుడ	13	0
హుకుంపేట	14	0
పెదబయలు	9	1
ముంచంగిపుట్టు	13	0
పాడేరు	5	1
జి.మాడుగుల	10	0
చింతపల్లి	11	1
జీకేవీధి	10	0
కొయ్యూరు	14	0
మొత్తం	121	3



హుకుంపేట మండలం కొట్నాపల్లిలో పిల్లర్లకే పరిమితమైన విలేజ్ క్లినిక్ భవనం

వైసీపీ ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ ఏపాటిదో ఇట్టే అర్థమవుతున్నది. మన్యంలో 121 భవనాలు మంజూరు కాగా, ప్రస్తుతం వాటిలో రెండు పనులు ప్రారంభం కాలేదు. మిగిలిన వాటిలో 11 పునాదుల స్థాయిలో, 18 పునాదులు పూర్తయి, 52 శ్లాబ్ ... మిగతా 8వ పేజీలో

నిఘా నీడలో మన్యం

- మావోల వారోత్సవాలతో విస్తృత సోదాలు
- ప్రధాన రహదారుల్లో బాంబు స్క్వాడ్‌లు, వాహన తనిఖీలు

పాడేరురూరల్, జూలై 29:

మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంతో అప్రమత్తమైన పోలీసులు నిఘాను పెంచారు. పాడేరు ప్రధాన రహదారుల్లో సోమవారం విస్తృతంగా వాహన తనిఖీలను చేపట్టారు. పాడేరు-విశాఖ, పాడేరు-చింతపల్లి, పాడేరు-అరకు, పాడేరు-పెదబయలు రహదారుల్లో వచ్చి పోయే ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రధాన రహదారులకు ఇరువైపుల బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో పరిశీలించారు. అనుమానితులను విచారించి విడిచిపెట్టారు.

ప్రయాణికుల లగేజీ బ్యాగ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జి.లక్ష్మణరావు మాట్లాడుతూ.. అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టామన్నారు. అపరిచితులకు ఆశ్రయం కల్పించవద్దని కోరారు. అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.



పాడేరులో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు



డొంకరాయి జలాశయం గేట్లు క్లోజ్ చేసిన దృశ్యం

డొంకరాయి నీటి విడుదల నిలిపివేత

- వర్షాలు తగ్గుముఖం పట్టడంతో 1,034 అడుగుల వద్ద స్థిరంగా నీటి మట్టం

సీలేరు, జూలై 29: సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదలను సోమవారం ఉదయం నిలిపివేశారు. సోమవారం ఉదయం ఏపీ జెన్‌కో ఈఈ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆదివారం రాత్రి నుంచి డొంకరాయి జలాశయం ఎగువ ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వలసగెడ్డ, పాలగెడ్డ వాగుల నుంచి ఇన్‌ఫ్లో తగ్గిందన్నారు. సోమవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో డొంకరాయి నీటి మట్టం 1,034.10 అడుగులకు తగ్గిందన్నారు. అందువల్ల నాలుగు గేట్ల ద్వారా నీరు విడుదల అవుతుండగా రెండు గేట్లను పూర్తిగా మూసి వేశామన్నారు. మరో రెండు గేట్లు ద్వారా 4,258 క్యూసెక్కులు నీటి విడుదల కొనసాగించారు. ఉదయం 11 గంటలకు జలాశయం నీటి మట్టం 1,034 వద్ద స్థిరంగా ఉండడంతో మిగతా రెండు గేట్లను కూడా పూర్తిగా మూసి వేశామని ఈఈ విజయ్‌కుమార్ తెలిపారు. పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి కోసం పవర్ కెనాల్ ద్వారా 3 వేలు క్యూక్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. డొంకరాయి జలాశయంలో 12.398 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని ఈఈ విజయ్‌కుమార్ తెలిపారు.


ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు తనిఖీలు

పాడేరు వైద్య కళాశాల గైనికాలజిస్టు పరీక్షలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చింతపల్లి, జూలై 29:

స్థానిక ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు ఎట్టకేలకు ఆరోగ్య తనిఖీలు జరిగాయి. సోమవారం పాడేరు వైద్య కళాశాల ప్రసుతి విభాగం అధిపతి డాక్టర్ తమర్బ నరసింగరావు గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఏరియా ఆస్పత్రిలోని ముగ్గురు గైనికాలజిస్టుల్లో ఒకరు సెలవులో వెళ్లగా.. మరో ఇద్దరు గైనికాలజిస్టులు పాడేరు జిల్లా ఆస్పత్రిలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఏరియా ఆస్పత్రిలో కొన్ని రోజులుగా గర్భిణులకు తనిఖీలు నిలిచిపోయాయి. గర్భిణుల సమస్యలపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వరుస కథనాలపై ఐటీడీఏ పీవో అభిషేక్ స్పందించారు. ఏరియా ఆస్పత్రికి గైనికాలజిస్టును పంపించి గర్భిణులకు వైద్య సేవలందించాలని పాడేరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వమిత్రను పీవో ఆదేశించారు. దీంతో పాడేరు మెడికల్ కళాశాల ప్రసూతి విభాగం అధిపతి డాక్టర్ నరసింగరావు, గైనికాలజిస్టులు వచ్చి గర్భిణులకు తనిఖీలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లు చేశారు.



గర్భిణికి అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేస్తున్న పాడేరు వైద్య కళాశాల ప్రసుతి విభాగం అధిపతి డాక్టర్ నరసింగరావు

సుందరీకరణపై సందిగ్ధం

అరకులోయ ప్రాజెక్టుపై వైసీపీ నిర్లక్ష్యం

- నాడు'పెదలబుడు'ని దత్తత తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- ప్రాజెక్టుకు రూ.24 కోట్లు మంజూరు
- ఆరేళ్లుగా సాగుతున్న పనులు
- నిధులున్నా సాగని పనులు
- బిల్లుల చెల్లింపుల్లో జాప్యం
- చంద్రబాబు మళ్లీ సీఎం కావడంతో చిగురించిన ఆశలు



డివైడర్ మధ్యలో వేయని సెంట్రల్ లైటింగ్

అరకులోయ, జూలై 29:

అరకులోయ సుందరీకరణ సుడిగుండంలో చిక్కుకుంది. రాష్ట్ర విభజన తర్వాత ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు నాయుడు పెదలబుడు పంచాయతీని దత్తత తీసుకున్నారు. పెదలబుడు పంచాయతీ అభివృద్ధికి కోట్లాది రూపాయలు వ్యయం చేశారు. పర్యాటకపరంగా ఉన్న ప్రాముఖ్యత నేపథ్యంలో 2018లో అరకులోయ సుందరీకరణ ప్రాజెక్టును అమలు చేశారు. అరకులోయ పట్టణంలో ఆర్‌ఐటీఐ నుంచి రైల్వే స్టేషన్ వరకు ఐదు కిలోమీటర్ల డబుల్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. రెండు పాత వంతెనల స్థానంలో కొత్త వంతెనలు నిర్మించేందుకు, 5 కిలోమీటర్లు సెంట్రల్ డివైడర్‌తో పాటు సెంట్రల్ లైటింగ్, ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగుకాల్వలు, వాటిపైన ఫుట్‌పాత్‌లు, ప్రధాన రహదారి నుంచి ఇరువైపులా వీధుల్లోకి వెళ్లేందుకు అప్రోచ్‌లు అభివృద్ధికి పక్కా ప్లాన్ రూపొందించారు. ఇందుకు రూ.24 కోట్లు మంజూరు చేసి, నిధులను విడుదల చేశారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభించిన ఏడాదిలో కరోనా రావడం, మరో రెండేళ్లు పనులు సక్రమంగా జరగలేదు. అప్పటికే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం, పనులన్నీ నిలిపివేశారు. దీంతో కాంట్రాక్టర్ తిరిగి పనులు చేపట్టేందుకు అనుమతులు పొందడంలో కాలయాపన జరిగింది. పనులు త్వరితగతిన చేసినప్పటికీ బిల్లుల చెల్లింపులు చేయలేదు. దీంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశాడు. సుందరీకరణలో ముఖ్యమైన డబుల్ రోడ్డు, అవసరమైన చోట కల్వర్టులు, సెంట్రల్ డివైడర్, రహదారికి ఇరువైపులా కాలువలు, ఫుట్‌పాత్ వేలు, వీధుల రోడ్లకు వెళ్లే అప్రోచ్‌లు నిర్మించారు.

ఇంకా పెండింగ్ పనులెన్నో..

సుందరీకరణ పనులు ప్రారంభించి ఆరేళ్లు అయినా ఇంకా రెండు వంతెనలు, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. ఈ పనులకు నిధులున్నాయి. అయినా జరగడం లేదు. రెండు వంతెనలు, సెంటర్ లైటింగ్‌లకు సంబంధించి వేర్వేరు టెండర్లు పిలుస్తామని గతంలో ఇంజనీరింగ్ అధికారులు ప్రకటించారు. అయితే ఇంతవరకు ఆ టెండర్లు పిలవడంలో జాప్యం జరుగుతోంది. వంతెనలకు సంబంధించి మట్టి పరీక్షలు అన్ని నిర్వహించారు కూడా.. అయినా టెండర్లు పిలవడంలో ఆలస్యమవుతోంది. ఈ రెండు వంతెనల్లో ఒకటి పబ్లిక్‌స్కూల్ - అరకులోయకు మధ్యను, మరొకటి అరకులోయ పట్టణ పరిధిలోని సెరికల్చర్ ఆఫీస్‌కు అంజలి రిసార్టుకు మధ్య నిర్మించాల్సి ఉంది. ఈ రెండు వంతెనల నిర్మాణాలకు రూ.పది కోట్లు, సెంటర్ లైటింగ్‌కు రూ.76 లక్షలు ఉన్నాయి.

సుందరీకరణ చంద్రబాబుతోనే సాధ్యం

-పెట్టెలి దాసుబాబు, సర్పంచ్, పెదలబుడు

అరకులోయ ప్రాధాన్యతను గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు పెదలబుడు పంచాయతీని దత్తత తీసుకున్నారు. పంచాయతీ పరిధిలోని 24 గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పనకు కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. అందులో భాగంగానే అరకులోయ పట్టణ సుందరీకరణకు రూ.24 కోట్లు మంజూరు చేశారు. వైసీపీ ప్రభుత్వం వంతెనలు, సెంటర్ లైటింగ్, మొక్కలు పెంపకాన్ని వదిలేశారు. మిగిలిన పనులు పూర్తి చేయాలంటే చంద్రబాబు హయాంలోనే సాధ్యం.



పబ్లిక్‌స్కూల్-అరకులోయ పట్టణానికి మధ్యలో నిర్మాణం చేపట్టని వంతెన

క్రైం... crime news

లింగంపేటలో కారు దగ్ధం


దగ్ధమైన కారును పరిశీలిస్తున్న ఎస్ఐ ఉపేంద్ర

కృష్ణాదేవిపేట, జూలై 29: గొలుగొండ మండలం లింగంపేట గ్రామానికి చెందిన పానింబిల్లి మంగ రాజుకు చెందిన బ్రీజా కారు ఆదివారం అర్ధరాత్రి దగ్ధమైంది. అయితే ఈ ప్రమాదం షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగిందా? లేదా ఎవరైనా గుర్తు తెలియన వ్యక్తులు దగ్ధం చేశారని అనుమానంతో బాధితుడు కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్రకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం ఉదయం కారును ఎస్ఐ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

మునగపాక (తుమ్మపాల), జూలై 29: మనస్తాపంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ ప్రసాదరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని ఒంపోలుపేటకు చెందిన నక్కా సత్యనారాయణ కుమార్తె నక్కా మాధురి(19) తనను కొందరు అవహేళన చేశారని మనస్తాపం చెంది శనివారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మాధురి మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో ఒకరికి యావజ్జీవ శిక్ష

కశింకోట/పాయకరావుపేట, జూలై 29: హత్య కేసులో నేరం రుజువు కావడంతో పాయకరావుపేటకు చెందిన వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ సోమవారం అనకాపల్లి జిల్లా కోర్టు తీర్పు ఇచ్చింది. దీనికి సంబంధించి కశింకోట సీఐ వినోద్‌బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాయకరావుపేటకు చెందిన రెడ్డం నరేశ్‌కుమార్(35) స్థానికంగా ఓ ప్రైవేటు స్కూల్ బస్ డ్రైవర్‌గా పనిచేస్తూ అదే స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్న సూరపు ఇందిరను పెళ్లి చేసుకుంటానని నమ్మించి కొంతకాలం సహజీవనం సాగించాడు. ఈ క్రమంలో తనను పెళ్లి చేసుకోమని ఒత్తిడి చేస్తున్న ఇందిరను అంతమొందించాలని నిర్ణయించుకున్న అతను 2017 మార్చి 19వ తేదీన కశింకోట మండలం కన్నూరుపాలెంలో రాజుగారి లేఅవుట్ వద్దకు తీసుకు వెళ్లాడు. అక్కడ ఆమెను విచక్షణారహితంగా బ్లేడుతో కోసి, పెట్రోల్‌పోసి అతి కిరాతకంగా హత్య చేశాడు. దీనిపై అప్పట్లో కేసు నమోదుచేసిన కశింకోట పోలీసులు నిందితుడు నరేశ్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి అనకాపల్లి రూరల్ సీఐ జి.రామచంద్రరావు కేసు దర్యాప్తు చేయగా, అనకాపల్లి 10వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో వాదోపవాదనలు జరిగిన తరువాత నేరం రుజువుకావడంతో జడ్జి నందనవనం శ్రీవిద్య సోమవారం నరేశ్‌కుమార్‌కి యావజ్జీవ కఠిన కారాగార శిక్షతోపాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని సీఐ వినోద్‌బాబు తెలిపారు.

నేటి నుంచి ఏయూ దూరవిద్య పరీక్షలు

▸ కొన్ని కేంద్రాల్లో డబ్బులు వసూలు?

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఏయూ దూర విద్య కేంద్రం విద్యార్థులకు మంగళవారం నుంచి వచ్చే నెలాఖరు వరకు పరీక్షలు జరగనున్నాయి. ఎంఏ, ఎంబీఏ, ఎంకాం విద్యార్థులకు మొదటి, రెండు, మూడు సెమిస్టర్ పరీక్షలు జరగనున్నాయి. అయితే, ఈ పరీక్షలను క్యాష్ చేసుకునేందుకు అనేక కళాశాలలు సిద్ధమయ్యాయి. పరీక్ష కేంద్రాలు కలిగిన కొన్ని కళాశాలలు విద్యార్థుల నుంచి డబ్బులు వసూలుచేసి ప్రశ్నపత్రాలను ముందుగానే లీక్ చేస్తున్నాయి. ఈ తరహా వ్యవహారాలకు ఆస్కారం లేకుండా ఏయూ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. దీనిపై వివరణ కోరేందుకు యత్నించగా ఏయూ దూర విద్యా సంచాలకులు అందుబాటులోకి రాలేదు. కొన్ని పరీక్ష కేంద్రాల్లో పేపర్లు ముందుగానే విద్యార్థులకు చేరుతున్నాయని తెలిసింది. ఆయా కేంద్రాల్లో విద్యార్థుల సమాధానాలు ఒకేలా ఉంటున్నాయి. గతంలో నిర్వహించిన పరీక్షల వాల్యుయేషన్‌కు వెళ్లిన అధ్యాపకులు జవాబుపత్రాలు చూసి ఆశ్చర్యపోయారు. ఆయా కేంద్రాల్లో ముందుగానే పేపర్ లీక్ చేయడం లేదా మాస్‌కాపీయింగ్ అవకాశం కల్పించడమే కారణంగా చెబుతున్నారు. దూర విద్యా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

పప్పల చలపతిరావుకు అయ్యన్న పరామర్శ


పప్పల చలపతిరావును పరామర్శిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

రాంబిల్లి, జూలై 29 : కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ సీనియర్ నేత పప్పల చలపతిరావును సోమవారం సాయంత్రం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పరామర్శించారు. రాంబిల్లి మండలం దిమిలిలోని చలపతిరావు ఇంటికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులతో కలిసి వెళ్లారు. చలపతిరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

విరగ్గాసిన డ్రాగన్ ఫ్రూట్

▸ వాణిజ్య పంటలపై దృష్టి సారించిన గిరిజనులు
▸ గత ఏడాది మూడు టన్నులు దిగుబడి
▸ ఆనందం వ్యక్తం చేస్తున్న గిరి రైతు


ఫ్రూట్‌ను సేకరిస్తున్న గిరిజనుడు

అనంతగిరి, జూలై 29: మన్యంలోని వాణిజ్య పంటలపై గిరిజనులు దృష్టి సారించడంతో లాభాలను ఆర్జిస్తున్నారు. మన్యం వాతావరణం వాణిజ్య పంటలకు అనుకూలించడంతో గిరిజన రైతులు డ్రాగన్ ఫ్రూట్, స్ట్రాబెరీ సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు.

మండలంలోని ఎగువశోభ పంచాయతీ మర్రిగుడ గ్రామ సమీపంలోని జన్ని సుబ్బారావు అనే గిరిజనుడు 2019లో రెండున్నర ఎకరాల్లో రూ.5 లక్షలతో డ్రాగన్ ఫ్రూట్ సాగును ప్రారంభించాడు. రెండేళ్లపాటు అంతంతమాత్రంగానే ఫ్రూట్ దిగుబడి ఉండేది. అయినా నిరాశ చెందలేదు. గత రెండేళ్లుగా ఒక్కసారిగా దిగుబడి పెరిగింది. ఏడాదికి మూడు టన్నుల వరకు దిగుబడి వచ్చింది. వీటిని అరకు-విశాఖ ప్రధాన రహదారిని ఆనుకుని స్టాల్స్ పెట్టి కిలో రూ.200 నుంచి రూ.250 వరకు విక్రయిస్తున్నారు. అంతేకాకుండా ఆ మార్గంలో వెళ్లే పర్యాటకులు, స్థానికులు డ్రాగన్ ఫ్రూట్‌ను కొనుగోలు చేస్తున్నారు. చూడడానికి పువ్వు ఆకృతిలో ఉండే ఈ పళ్లను పిటాయి, స్ట్రాబెర్రీ పియర్‌గా పిలుస్తుంటారు. శ్వాసకోశ, దంత సమస్యలు, మెదడు వ్యాధులు, మలబద్ధకం, గుండె సంబంధిత వ్యాధుల నివారణకు ఈ పండు ఉపయోగపడుతుంది. డ్రాగన్ ఫ్రూట్‌లో సీ విటమిన్ ఉంటుంది. ఇక్కడ పండిన డ్రాగన్ ఫ్రూట్‌ను విశాఖపట్నంలోని పర్యాటక ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్టు రైతు జన్ని సుబ్బారావు తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	82.00
లైవ్ ధర	102.00
విత్ స్కిన్	174.00
స్కిన్ లెస్	184.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

▸ అవే ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోండి
▸ అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం


అర్జీదారునితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్


కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న పరవాడ మండలం దేశపాత్రునిపాలెం వాసులు

తుమ్మపాల, జూలై 29 : అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అవే ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి 283 అర్జీలు అందాయన్నారు. వాటిలో రెవెన్యూశాఖకు 166, పోలీస్‌శాఖకు 15, సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్సుకు సంబంధించి 16, పంచాయతీరాజ్‌శాఖకు సంబంధించి 15, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు నాలుగు, రూరల్ డెవలప్‌మెంట్‌కు ఏడు, ఇతర విభాగాలకు సంబంధించి 83 అర్జీలు అందాయన్నారు. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన దివ్యాంగుడైన కె.దీపక్ తనకు ప్రాణహాని ఉందంటూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఒక హత్య కేసులో సాక్షిగా ఉన్న తనను నిందితులు చంపుతామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అచ్యుతాపురం మండలం చౌడపల్లిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా 15 ఎకరాల్లో అక్రమ లేఅవుట్‌లను వేసి 200 కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని, అధికారులు తక్షణమే కాపాడాలని విశాఖకు చెందిన పీఎల్‌వీఎన్ మూర్తి ఫిర్యాదు చేశారు. వీటితో పాటు మరిన్ని ఫిర్యాదులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి వై.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి, అధికారులు పాల్గొన్నారు. కాగా పరవాడ మండలం దేశపాత్రునిపాలెం రెవెన్యూ పరిధిలో రూ.400 కోట్ల విలువైన సుమారు 120 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుందని, అధికారులు తక్షణమే ఆ భూమిని కాపాడాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. అనకాపల్లి జిల్లా కింతలి వల్లాపురం పంచాయతీ పరిధి శరభన్నపాలెంలో ఏళ్ల తరబడి కొండపోరంబోకు భూములను సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నా ఇంతవరకు ప్రభుత్వం పట్టాలు అందించలేదని, ప్రభుత్వం తక్షణమే పట్టాలు మంజూరు చేయాలని గిరిజనులు ఆందోళన చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

▸ ఎస్పీ ఎం.దీపిక


ఫిర్యాదీతో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

తుమ్మపాల, జూలై 29: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందుతున్న ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 47 ఫిర్యాదులు అందాయని చెప్పారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర ఫిర్యాదులు అందాయన్నారు. ఈ మేరకు ఎస్పీ ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయబాస్కర్, ఎస్ఐ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ వంశస్థురాలికి సత్కారం


రాణీ అమ్మాజీని సత్కరిస్తున్న కూటమి నాయకులు

నక్కపల్లి, జూలై 29: ప్రభుత్వ బడుల్లో పిల్లలకు సోమవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు. ఈ సందర్భంగా డొక్కా సీతమ్మ వంశానికి చెందిన నక్కపల్లి హైస్కూల్ హెచ్‌ఎం రాణీ లలితను ఎంఈవో కె.నరేశ్, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు కోసూరి శ్రీను, పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కక్కిరాల సురేశ్, అడ్డూరి లోవరాజు, కొప్పిశెట్టి వీరబాబు, పచ్చిపులుసు నాగేశ్వరరావు, అడ్డూరి చిన్న, అల్లాడ తాతారావు, కొత్త శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చాలా సంతోషంగా ఉంది



మేం డొక్కా సీతమ్మ వంశానికి చెందిన వాళ్లం. మా తండ్రి రాణీ నర్సింహమూర్తి డొక్కా సీతమ్మకు మనుమడు అవుతారు. తరాలు మారినా డొక్కా సీతమ్మ వంశీకురాలిగా నేను వున్నందుకు చాలా గర్వంగా వుంది. ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి ఆ పేరు పెట్టడం చెప్పలేనంత ఆనందంగా వుంది. ఆ మహాతల్లి అన్నపూర్ణగా చరిత్రలో నిలిచిపోయింది. **- రాణీ అమ్మాజీ, డొక్కా సీతమ్మ వంశస్థురాలు**

వీఎంఆర్‌డీఏ పరిధి నుంచి చోడవరానికి విముక్తి కల్పిస్తా

▸ మునిసిపాలిటీ అవసరం లేదు
▸ త్వరలోనే బీఎన్ రోడ్డు నిర్మాణ పనులు
▸ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు


ఎమ్మెల్యే రాజును సత్కరిస్తున్న వడ్డాది జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్

చోడవరం, జూలై 29: వీఎంఆర్‌డీఏ పరిధి నుంచి చోడవరం నియోజకవర్గానికి విముక్తి కల్పిస్తామని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశాఖ అర్బన్ పరిధిలో చోడవరం నియోజకవర్గంలోని చాలా ప్రాంతాలను వైసీపీ హయాంలో విలీనం చేశారన్నారు. వీఎంఆర్‌డీఏ పరిధిలో ఉండడంతో పంచాయతీ ఆదాయంతో పాటు సామాన్యులు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తున్నదన్నారు. అందువల్ల వీఎంఆర్‌డీఏలో కలిపిన మండలాలను తప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చోడవరం పట్టణంలో కూడా ఎక్కువ శాతం పేదలు ఉన్నారని, ఇటువంటి ప్రాంతాన్ని మునిసిపాలిటీ చేయడం వల్ల కూడా ప్రయోజనం ఉండదని, పైగా పన్నుల భారం కూడా పెరిగిపోతుందన్నారు. అందువల్ల మునిసిపాలిటీని కూడా కానివ్వబోమని స్పష్టం చేశారు.

బీఎన్ రోడ్డు కష్టాలకు త్వరలోనే మోక్షం

బీఎన్ రోడ్డులో మరమ్మతు పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని, సంబంధిత కాంట్రాక్టర్‌తో కూడా మాట్లాడామని ఎమ్మెల్యే రాజు తెలిపారు. బీఎన్ రోడ్డుకు మంజూరైన నిధులను వైసీపీ ప్రభుత్వం వేరే పనులకు మళ్లించిందని, ఆ నిధులను తిరిగి వెనక్కి తెప్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదన్నారు. బీఎన్ రోడ్డులో వడ్డాది వద్ద వంతెన నిర్మాణానికి రూ.25 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. పూర్తి స్థాయి పనులు చేపట్టేలోగా ప్రజలకు ఇబ్బంది లేకుండా మరమ్మతు పనులు ప్రారంభమవుతాయన్నారు. అలాగే నియోజకవర్గానికి రూ.30కోట్ల మేర ఉపాధి నిధులు వచ్చే అవకాశం ఉందని, ఈ నిధులతో నాలుగు మండలాల్లో పనులు చేపట్టనున్నామని ఎమ్మెల్యే రాజు వివరించారు. వడ్డాది జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్‌గా నియమితులైన వై.అన్నపూర్ణ సోమవారం ఎమ్మెల్యే రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యేను సత్కరించారు.

అప్పన్నకు 350 గ్రాముల స్వర్ణ హారం బహూకరణ


స్వర్ణ హారాన్ని అధికారులకు అందజేస్తున్న భక్తుడు సూర్యచంద్రరావు

సింహాచలం, జూలై 29: వరాహ లక్ష్మీనృసింహస్వామికి ప్రత్యేక సందర్భాల్లో అలంకరణకు వినియోగించాలని కోరుతూ విశాఖ నగర పరిధిలోని మధురవాడ ప్రాంతానికి చెందిన భక్తుడు కె.సూర్యచంద్రరావు సోమవారం స్వర్ణ హారాన్ని బహూకరించారు. అధికారులు హారాన్ని తూకం వేసి 350 గ్రాములు ఉన్నట్టు నిర్ధారించారు. దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తికి సూర్యచంద్రరావు ఆ హారాన్ని అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించి, వారి గోత్రనామాలతో పూజలు జరిపించారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, ఆలయ ఏఈఓ ఆనందకుమార్ దాతను శాలువాతో సత్కరించి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.97 కోట్లు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, సేవకులు

సింహచలం, జూలై 29 : వరాహలక్ష్మీ నృసింహస్వామికి గత 33 రోజులకు హుండీల ద్వారా రూ.1.97 కోట్ల ఆదాయం సమకూరింది. ఈఓ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి. వసంత్‌కుమార్, గ్రేడ్-1 ఈఓ నీలిమ పర్యవేక్షణలో సోమవారం సింహగిరిపై పరకామణి కేంద్రంలో సిబ్బంది హుండీల లెక్కింపు చేపట్టారు.రూ.1,97,06,300 నగదు లభించగా, స్వర్ణం 100 గ్రాములు, రజితం 11 కిలోల 800 గ్రాములు ఆభరణాల రూపంలో సమకూరింది. అలాగే 163 యూఎస్ఏ డాలర్లు, యూఏఈకి చెందిన 5 దీరమ్స్, నాలుగు సింగపూర్ డాలర్లు, పది ఆస్ట్రేలియా డాలర్లు, ఇరవై కెనడా పౌండ్లు, 40 ఖతార్ రింగిట్స్, 21 సౌదీ అరేబియా రియల్స్, కువాయిట్‌కు చెందిన 1.5 దీనార్స్, 50 నేపాల్ రుపీస్, 26 మలేషియా షిల్లింగ్స్ తదితర విదేశీ కరెన్సీ కూడా స్వామివారి ఖజానాకు చేరింది.

నేవీ రోడ్డు గోతులమయం


అప్పన్నపాలెం చర్చి జంక్షన్ వద్ద ఏర్పడిన గొయ్యి



రాంబిల్లి, జూలై 29: మండలంలోని ప్రధాన నేవీ రోడ్డు గోతులమయంగా ఉంది. రాంబిల్లి మండలంలో ఎన్ఏవోబీ ఏర్పాటు కావడంతో పదేళ్ల క్రితం వెంకటాపురం జంక్షన్ నుంచి వాడనర్సాపురం సమీపంలోని నేవీ గేటు వరకు సుమారు 12 కిలోమీటర్లు దూరం వరకు నేవీ రోడ్డును నిర్మించారు. ఈ రోడ్డులో వాహనాలు రాకపోకలు అధికంగా ఉండడంతో గత ఐదేళ్లుగా రోడ్డు పొడవునా గోతులు ఏర్పడ్డాయి. వర్షం కురిసినప్పుడు ఈ గోతుల్లో నీరు చేరి ఏది రోడ్డో, ఏ గొయ్యో తెలియని పరిస్థితి నెలకొంటోంది. దీని వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేయించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

డైరెక్టర్ దృష్టికి గిరిజన సంక్షేమ టీచర్ల సమస్యలు

▸ టీడబ్ల్యూటీఏ రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ


అమరావతిలో టీడబ్ల్యూ డైరెక్టర్ పి.నవ్యకు వినతిపత్రం సమర్పిస్తున్న టీడబ్ల్యూటీఏ నేతలు

పాడేరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ పినవ్యకు గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల సమస్యలపై సోమవారం అమరావతిలో వినతిపత్రం సమర్పించామని గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ స్థానిక విలేకరులకు తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు నిర్వహించాలని, ప్రధానంగా అరులైన సీనియర్ టీచర్లను ఎంఈవోలు, డిప్యూటీ డీఈవోలుగా పదోన్నతులు కల్పించాలని, ఖాళీలను భర్తీ చేయాలని, భాషా పండితుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్‌లుగా అప్‌గ్రేడ్ చేయాలని, ఆశ్రమ పాఠశాలల్లో టీచర్ల రాత్రి బసను తొలగించాలని, గిరిజన నిరుద్యోగుల కోసం స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శేషగిరిరావు, అల్లూరి జిల్లా అధ్యక్షుడు కంబిడి నీలకంఠం, వివిధ జిల్లాలకు చెందిన నేతలు పోసయ్య, గాంధీబాబు, మంగిరెడ్డి, సింగరాజు, గంగరాజు, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

మావోలకు వ్యతిరేకంగా ఆదివాసీల ర్యాలీ


మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న ఆదివాసీలు

గూడెంకొత్తవీధి, జూలై 29: మావోయిస్టులారా.. అమరవీరుల వారోత్సవాలు ఎవరి కోసమంటూ సోమవారం గిరిజన యువత మండల కేంద్రంలో మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ చేశారు. మా గ్రామాల అభివృద్ధిని అడ్డుకుంటున్న మావోయిస్టులను తరిమి కొడతామని ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు.

పిల్లల్లో భక్తిభావం పెంపొందించాలి

▸ ప్రముఖ ప్రవచనకర్త గరికిపాటి నరసింహారావు


ప్రవచనం చేస్తున్న గరికిపాటి

అనకాపల్లి టౌన్, జూలై 29 : పిల్లల్లో భక్తి భావాన్ని తల్లిదండ్రులు పెంపొందించాలని ప్రముఖ ప్రవచనకర్త గరికిపాటి నరసింహారావు అన్నారు. స్థానిక వుప్పల చంద్రశేఖర్ కల్యాణ మండపం ఆవరణలో కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఆయన ప్రవచనం చేశారు. ముందుగా ఆలయంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కల్యాణ మండపం ఆవరణలో ఆయన ప్రవచనం చేస్తూ ప్రతి ఒక్కరూ నుదుటిపై కుంకుమ బొట్టు పెట్టుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో- చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషకుమార్, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బిళ్లపాటి కృష్ణకుమార్, కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీదరాల సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

పశుగణనపై ప్రాంతీయ సదస్సు రేపు

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో త్వరలో చేపట్టనున్న పశుగణనపై ఈనెల 31వ తేదీన నగరంలోని ఒక హోటల్‌లో ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు పశు సంవర్థక శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఈ సదస్సుకు ఏపీ వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హాజరవుతారని జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ రామకృష్ణ తెలిపారు.



పాఠశాల విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న బీజేపీ నాయకులు, గ్రామ పెద్దలు

శుభదిన్ కార్యక్రమం విజయవంతం

పాడేరు రూరల్, జూలై 29: కొత్తపాడేరు పాఠశాలలో (ఆనందలహరి డెమోస్కూల్) సోమవారం ప్రధాన మంత్రి శుభదిన్ భోజన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భోజనంతో పాటు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం బీజేపీ నాయకుడు సల్లా రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఉన్నత విద్యనభ్యసించి పాఠశాలకు, గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. పాఠశాల పరిశుభ్రతతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో శుభదిన్ భోజన దాత సల్లా రామకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు మాధవరావు, శ్యామల గ్రామ పెద్దలు కె.రాజారావు, జి.దేవేంద్రుడు, డి.శివప్రసాద్ పాల్గొన్నారు.

తుఫాన్ బాధిత గ్రామాల్లో సేవా కార్యక్రమాలు



బాధిత కుటుంబాలకు టార్పాన్‌లు అందిస్తున్న ఎన్ఎస్ఎస్ బృంద సభ్యులు

పాడేరు రూరల్, జూలై 29: తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు చింతూరు ఐటీడీఏ పరిధిలో ముంపుకు గురైన గ్రామాల్లో ప్రజలకు పలు సంస్థల ప్రతినిధులు సహాయ, సేవా కార్యక్రమాలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ జి.గౌరీశంకరరావు, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కో-ఆర్డినేటర్‌లు ముంపు ప్రాంతాలో పర్యటించి నిరాశ్రయులైన బాధితులకు అవసరమైన సేవలను అందించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి వెంకటేశ్వరరెడ్డి సమకూర్చిన 950 టార్పాలిన్లు, దోమతెరలను బాధితులకు పంపిణీ చేశామని పీవో గౌరీశంకరరావు తెలిపారు. వారికి అవసరమైన పలు సహకారాలను అందించామని వివరించారు. ఈ మేరకు గౌరీశంకరరావును కళాశాల ప్రిన్సిపాల్ మనుము చిట్టబ్బాయి, వైస్ ప్రిన్సిపాల్ టీఎస్.రసూల్, సిబ్బంది అభినందించారు.

దోమల మందు పిచికారీ చేయించుకోండి

చింతపల్లి, జూలై 29: ప్రతీ కుటుంబం గృహం లోపల దోమల మందు పిచికారీ చేయించుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి బుక్కా చిట్టిబాబు సూచించారు. మడిగుంట గ్రామంలో జరుగుతున్న రెండో విడత దోమల నివారణ మందు పిచికారీ ప్రక్రియను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో మలేరియా జ్వరాలు నియంత్రించేందుకు ఏసీఎం ఐదు శాతం మందును పిచికారీ చేస్తున్నామన్నారు. ఈ మందును గిరిజనులు పిచికారీ చేసుకోవడం వల్ల దోమ కాటుకు దూరంగా ఉండవచ్చునన్నారు. వాసన వస్తుందని కొంత మంది ఆదివాసీలు దోమల మందు పిచికారీ నిరాకరించడం సరికాదన్నారు. అలాగే గిరిజనులకు చలితో కూడిన జ్వరం వచ్చిన వెంటనే పీహెచ్‌సీకి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. జ్వరాలను అశ్రద్ధ చేస్తే ప్రమాదమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీయూ గుమ్మ యుగంధర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



దోమల మందు పిచికారిని పరిశీలిస్తున్న సబ్ యూనిట్ అధికారి చిట్టిబాబు

800 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు



రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి, జూలై 29: గిరిజన రైతులతో 800 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం వంచుల, కొడిసింగి గ్రామాల్లో వైఎస్ ఎంపీపీలు ఆనంద్, దేవుడుతో కలిసి ఉద్యాన మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి విడతగా 40 ఎకరాలకు సంబంధించి 29 వేల మొక్కలు పంపిణీ చేశామన్నారు. మలి విడతలో ఇతర గ్రామాల రైతులకు పూర్తి స్థాయిలో మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. మొక్కలు నాటుకున్న రైతుకు మూడేళ్ల పాటు నిర్వాహణ ఖర్చులు అందిస్తామని చెప్పారు. ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి కలిగిన రైతులు ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాసులమ్మ, ఈవోపీఆర్‌డీ పాపారావు, పీఎస్‌వో రాంప్రసాద్, కూటమి నాయకులు రాజేశ్వరి పాల్గొన్నారు.

విలేజ్ క్లినిక్‌లకు గూడు కరవు

... 5వ పేజీ తరువాయి

లెవల్‌లో, 17 శ్లాబు కంటే తక్కువ స్థాయిలో, 18 పూర్తయ్యే దశలో, పూర్తయిన 3 భవనాలను వైద్యారోగ్యశాఖకు అప్పగించారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయా భవనాల నిర్మాణానికి అవసరమైన రూ.10 కోట్లు పైబడి నిధులు తక్షణమే మంజూరైతే, మరో ఆరు నెలల్లో వాటి నిర్మాణం పూర్తి చేసుకుని అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. కానీ వాస్తవానికి ఆ భవన నిర్మాణాలకు రెండేళ్లుగా నిధులు మంజూరు కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో విలేజ్ క్లినిక్ భవన నిర్మాణాలపై ప్రస్తుతం అయోమయం నెలకొంది.

సంప్రదాయ జీవనోపాధి మెరుగుకు చర్యలు

... 5వ పేజీ తరువాయి

ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణా ప్రాంత ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచాలనే లక్ష్యంతోనే నాబార్డు ఏర్పడిందన్నారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామన్నారు. అధికార యంత్రాంగం, బ్యాంకులు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో గిరిజనులు సంప్రదాయాలు, ఆర్థిక స్థితిగతులు మెరుగుకు, అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల విలువను పెంచేందుకు కృషి చేస్తామన్నారు. అందుకు అందరూ సహకరించాలన్నారు. అంతకుముందు ఆయన స్థానిక మోదకొండమ్మను దర్శించుకున్నారు. అనంతరం మండలంలో నాబార్డు ద్వారా జరుగుతున్న పలు కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. స్థానిక డీడీఎం రావూరి చక్రధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాబార్డు ఆర్వో ఏజీఎం కౌశిల్‌కుమార్, ఆర్వో సామంత్‌కుమార్, విశాఖపట్నం, అనకాపల్లి డీడీఎంలు ముత్తునాయుడు, వర్మ, పలు స్వచ్ఛంద సంస్థల, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వర్షాలు తెచ్చిన కష్టాలు ఇన్నన్ని కాదయా..!

- గెడ్డ పరీవాహక గ్రామాల్లో సంబంధాలు కట్
- ఉధృతంగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ పాయలు
- రాకపోకల కోసం గిరిజనులకు తప్పని ఇబ్బందులు

ముంచంగిపుట్టు, జూలై 29: భారీ వర్షాలతో గిరిజనులు ఎదురవుతున్న కష్టాలు ఇన్నన్ని కాదు. దాదాపు 15 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండల పరిధిలోని మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న గ్రామాల ప్రజలు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. దోడిపుట్టు, లక్ష్మీపురం, రంగబయలు, బూసిపుట్టు, బుంగాపుట్టు తదితర పంచాయతీల పరిధిలో పలు గ్రామాల్లో వాగులు వంకలు, మత్స్యగెడ్డ పాయలు వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. అత్యవసర సమయాల్లో అత్యంత కష్టంగా గెడ్డలు దాటాల్సి వస్తుందని పలు గ్రామాల గిరిజనులు వాపోతున్నారు. లక్ష్మీపురం పంచాయతీ బిర్రుగూడ సమీపంలో ద్విచక్ర వాహనాలను కావిడి సమాయంతో స్థానికులు గెడ్డ దాటించాల్సి వచ్చింది. ఈ పంచాయతీ పరిధిలో లక్ష్మీపురం, ఉబ్బెంగుల, కర్లాపొదర్ తదితర ప్రాంతాల్లో గెడ్డలు ఉగ్రరూపాన్ని దాల్చాయి. దీంతో సుమారు 52 గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. అత్యవసర సమయాల్లో సైతం ఇల్లు విడిచి బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. 108 అత్యవసర వాహన సేవలకు దూరమయ్యారు.

దెబ్బతిన్న నూతన వంతెన పిలర్లు

లక్ష్మీపురం పంచాయతీ బిర్రుగూడ సమీపంలో సమీపంలో మత్స్యగెడ్డ పాయపై నూతనంగా వంతెన నిర్మాణంకు సంబంధించి వేసిన సిమ్మెంట్ పిల్లర్లు వరదనీటి ఉధృతికి దెబ్బతిన్నాయి. ఆ వంతెనకు రెండువైపులా వేసిన పిల్లర్లు కోతకు గురయ్యాయి. మట్టి కొట్టుకుపోయింది. దీంతో లక్ష్మీపురం, బుంగాపుట్టు, బరడ తదితర పంచాయతీల్లో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇటీవల అటుగా వెళ్లిన పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్‌కు కూడా వినతిపత్రం అందించారు. వంతెన పనులు అసంపూర్తితో నిలిచిపోవడం, ప్రస్తుతం గెడ్డ ఉధృతంగా ప్రవహించడం వల్ల అత్యవసర సమయాల్లో పంచాయతీ, మండల కేంద్రాలకు వెళ్లలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో సుమారు నాలుగు నెలలు పాటు బాహ్యప్రపంచంతో తమకు సంబంధాలు తెలిపోతున్నాయని వారు తెలిపారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలకు తెగించి గెడ్డ దాటుతున్నామని అన్నారు. వంతెన నిర్మాణం పూర్తి అయితే సుమారు 52 గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు మార్గం సుగమమవుతుందని చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి నూతన వంతెన పనులు వేగవంతంగా పూర్తయ్యే విధంగా తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతీయులు కోరుతున్నారు.



బిర్రుగూడ సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ.. వరద నీటి తాకిడికి దెబ్బతిన్న నూతన వంతెన పిల్లర్లు

టూరిజం కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు

అరకులోయ, జూలై 29: అరకులోయ స్కిల్ కాలేజీలో టూరిజంలో శిక్షణ కోసం నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కిరణవర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు నెలల పాటు వైటీసీలో శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామని, యూనిఫారాలు అందిస్తామని చెప్పారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించి, 20 ఏళ్ల నుంచి 35 ఏళ్ల లోపు అభ్యర్థులు శిక్షణకు అర్హులుగా తెలిపారు. ఆసక్తి గల వారు వచ్చే నెల 1వ తేదీన విద్యార్హత ధ్రువపత్రాలతో వైటీసీ అరకులోయకు హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు 6303511674, 7337004515 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

చాపరాయిలో ప్రవేశాలు పునఃప్రారంభం



తెరుచుకున్న చాపరాయి జలవిహారి గేటు

డుంబ్రిగుడ, జూలై 29: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో ఏజెన్సీ వ్యాప్తంగా గత వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మూతబడ్డ చాపరాయిని తిరిగి ప్రారంభించారు. భారీ వర్షాలకు చాపరాయి జలవిహారి ఉగ్రరూపం దాల్చింది. దీంతో పర్యాటకులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో ఆదేశాలతో నిర్వాహకులు తాత్కాలికంగా ప్రవేశాలను నిలిపివేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సోమవారం చాపరాయి జలవిహారి ప్రవేశాలను పునఃప్రారంభించారు.

లక్ష్మీపురంలో పారిశుధ్య పక్షోత్సవాలు

అనంతగిరి, జూలై 29: మండల కేంద్రంలోని లక్ష్మీపురం గ్రామంలో సోమవారం పారిశుధ్య పక్షోత్సవాలు నిర్వహించారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, సర్పంచ్ రూతు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీటి ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. అలాగే వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో నగేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సంతోషికుమారి, కార్యదర్శి బాలకృష్ణ పాల్గొన్నారు.

గెడ్డలు, వాగుల్లో చేపల వేటకు వెళ్లొద్దు

సీలేరు, జూలై 29: వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు వాగులు, గెడ్డల ఉధృతి తగ్గేంత వరకు వేటకు వెళ్లకూడదని సీలేరు ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. సోమవారం దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని బూసుకొండ, శాండికోరి, వలసగెడ్డ, వలస గెడ్డకొత్తూరు, పార్వతీనగర్ గ్రామాలను సోమవారం సందర్శించి గిరిజనులతో సమావేశమయ్యారు. భారీ వర్షాలకు ఈ ప్రాంతంలో వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నందున చేపల వేటకు వెళ్లవద్దని, గెడ్డలు దాటవద్దని గిరిజనులను హెచ్చరించారు. అలాగే నాటు పడవలపై గెడ్డల్లో ప్రయాణం ప్రమాదకరమని సూచించారు.

సీహెచ్‌సీకి పెరిగిన రోగుల తాకిడి

ముంచంగిపుట్టు, జూలై 29: ఏకధాటిగా వర్షాలు కురవడంతో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోగుల తాకిడి పెరిగింది. ఎక్కువ శాతం మంది కాళ్ల ఒరుపులు, దగ్గు, జలుబు, తలనొప్పి, జ్వరం వంటి సమస్యలతోనే వస్తున్నారు. ఎక్కువ రోజుల పాటు నీటిలో కాళ్లు తడవడం వలన పలు రకాల ఆరోగ్య సమస్యలు తెలెత్తే ప్రమాదం ఉందని ఈ సందర్భంగా వైద్యులు తెలిపారు. వర్షాలు తగ్గి ప్రస్తుతం ఎండ రావడంతో వాతావరణం మార్పు చెందడం వల్ల వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, వాటి బారిన పడకుండా ప్రజలు తగిన ఆరోగ్య సూత్రాలు పాటించాలని వైద్యులు సూచించారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు: ఎస్ఐ

ముంచంగిపుట్టు, జూలై 29: గంజాయి, సారా తదితర మత్తు పదార్థాల జోలికి ఎవరూ వెళ్లరాదని ఎస్ఐ కె.రవీంద్ర సూచించారు. స్థానిక ప్రభుత్వం కళాశాలలో విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులకు వాలీబాల్ కిట్టును అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు. అలాగే విద్యార్థులు గ్రామాల్లోకి వెళ్లేటప్పుడు ఎవరైనా గంజాయి పండిస్తున్నట్టు, సారా తయారు చేస్తున్నట్టు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. మాదకద్రవ్యాలకు ఎంత దూరంగా ఉండే భవిష్యత్తు అంత బాగుంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఏయూకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి

... 5వ పేజీ తరువాయి

రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కిశోర్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. ఇన్‌చార్జి వీసీ బాధ్యతలు స్వీకరించిన కొద్దిరోజులకే ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వర్సిటీకి వస్తుండడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇక్కడి వ్యవహారాలను నేరుగా పరిశీలించి విద్యా శాఖా మంత్రి నారా లోకేష్‌కు నివేదిక సమర్పించే అవకాశం ఉంది. మంత్రి సూచనల మేరకే ఆయన వస్తున్నట్టు చెబుతున్నారు. సౌరబ్ కుమార్ వచ్చి వెళ్లిన తరువాత వర్సిటీలో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశముందన్న చర్చ సాగుతోంది. ముఖ్యంగా గత పాలకుల అడ్డగోలు వ్యవహారాలు, నియా మకాలు, నిధులు దుర్వినియోగంపై ప్రభుత్వం విచారణకు ఆదేశించనుందని ప్రచారం జరుగుతోంది. ఇదిలావుండగా వర్సిటీలోని ఇబ్బందులు, గత పాలకులు చేసిన అడ్డగోలు వ్యవహారాలు, నియామకాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లేందుకు పలువురు సిద్ధమవుతున్నారు.

నిరాశాజనకంగా కూటమి ప్రభుత్వ పాలన

వైసీపీ జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి

పాడేరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలన నిరాశాజనకంగా సాగుతున్నదని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి విమర్శించారు. అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంతో కలిసి తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు ఎన్నో ఆశలు పెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అందుకు అనుగుణంగా పాలన సాగించలేకపోయిదన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు ఎన్నో సేవలందించే వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. పోలీసు వ్యవస్థ సైతం గాడి తప్పిందని భాగ్యలక్ష్మి ఆరోపించారు.



మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి, పక్కన మత్స్యలింగం

పంతలచింత పాఠశాలకు సందర్శించిన ఎమ్మెల్యే

డుంబ్రిగుడ, జూలై 29: మండలంలోని పోతంగి పంచాయతీ పంతలచింత మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం సోమవారం సందర్శించారు. పాఠశాలలో చిన్నారులతో ముచ్చటించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని చిన్నారులకు వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. విద్యా ప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన సూచించారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించడంలో రాజీ పడవద్దని, పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేల విద్యను బోధించాలని కొరారు. కార్యక్రమంలో ఎంఈవో సుందర్రావు పాల్గొన్నారు.



చిన్నారులకు పాఠాలు బోధిస్తున్న ఎమ్మెల్యే రేగం

సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన గిరి సర్పంచులు

పాడేరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును తెలుగుదేశం పార్టీ నాయకులు, గిరిజన సర్పంచులు అమరావతిలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ముంచంగిపుట్టు మండలం దారెల సర్పంచ్ పాంగి పాండురంగస్వామి, హుకుంపేట మండలం బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణరాజు, మరికొంత మంది గిరిజన సర్పంచ్‌లు సీఎంను కలిసి, పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలని, గిరిజన ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల చేయాలని సీఎం చంద్రబాబును కోరినట్టు వారు తెలిపారు.



సీఎం చంద్రబాబునాయుడుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గిరిజన సర్పంచులు

పర్యాటకులు జాగ్రత్త వహించాలి: సీఐ రుద్రశేఖర్

అరకులోయ, జూలై 29: ఏజెన్సీలో ఏకధాటిగా కురుస్తున్న వర్షాల కారణంగా పర్యాటకులు జాగ్రత్త వహించాలని సీఐ రుద్రశేఖర్ సూచించారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రమాదకరంగా, ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలను ప్రజలు సాహసం చేసి దాటే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ప్రాణాలు పోగొట్టుకునే విధంగా మొండిగా వ్యవహరించకూడదన్నారు. అలాగే పలు జలపాతాలు వర్షాలతో ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయని, పర్యాటకులు వాటి దగ్గరకు వెళ్లొద్దని సీఐ హెచ్చరించారు. సర్కిల్ పరిధిలో గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. ఇందుకోసం ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని ఆయన వివరించాఉ. ఈ సమావేశంలో ఎస్ఐ ఆర్.సంతోష్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ రుద్రశేఖర్, పక్కన ఎస్ఐ సంతోష్

77 గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు

ముంచంగిపుట్టు, జూలై 29: మండలంలోని కిలగాడ పంచాయతీ కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో 77 గొర్రెలు, మేకలకు వ్యాక్సినేషన్ చేయడం జరిగిందని పశు వైద్యాధికారి సౌజన్యదేవి తెలిపారు. అలాగే వర్షాకాలంలో పశువులు వ్యాధులు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సోకే వ్యాధులు, వాటి నివారణ చర్యలను గిరిజన రైతులకు వివరించారు. వర్షాలు కురిసే సమయంలో పశువులను బయటకు వదలరాదని, వాటి ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మూగజీవాలకు వ్యాక్సినేషన్ చేస్తున్న పశు వైద్య సిబ్బంది

గుంటసీమలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

డుంబ్రిగుడ, జూలై 29: గుంటసీమ పంచాయతీ కేంద్రంలో సోమవారం క్యాన్సర్ ఉచిత పరీక్షలు శిబిరాన్ని నిర్వహించారు. ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో క్యాన్సర్ పరీక్షలు చేశారు. వైఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్టు, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్, పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది. రొమ్ము, గొంతు, గర్భాశయ, నోటి క్యాన్సర్ పరీక్షలతో పాటు ఈసీజీ పరీక్షలు కూడా చేయించారు. గ్రామంలో164 మంది గిరిజనులు పాల్గొని వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో వైద్యధికారి గౌతమ్, క్యాంపు కోఆర్డినేటర్ కనకేశ్వరరావు, వైద్య సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న గిరి మహిళ

సంక్షిప్తంగా..

విజనరీ సీఎం చంద్రబాబు అన్ని పథకాలు అమలు చేస్తారు

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర

అరకులోయ, జూలై 29: విజనరీ సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలుచేసి తీరుతారని టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హమీలన్నీ అమలు చెసేందుకు ప్రబుత్వం కట్టుబడి ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అథోగతి పాలు చేశారని, వాటిని చక్కదిద్దుకుంటూ ప్రాధాన్యతాను సారంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. వైసీపీ ఎమ్మెల్యేలు కాస్త ఓపికతో చూస్తే పథకాలన్నీ అమల్లోకి వస్తాయన్నారు. గత సీఎం జగన్ మాదిరిగా ముందు చూపు లేకుండా బటన్ నొక్కే పరిస్థితి ఉండదన్నారు. ప్రణాళికబద్ధంగా అన్ని పథకాలు అమలు చేస్తారని దొన్నుదొర చెప్పారు.

కౌలు రైతు కార్డుల నమోదుకు దరఖాస్తుల ఆహ్వానం

కొయ్యూరు, జూలై 29: రైతు సంక్షేమాన్ని దృష్టిలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల ఫలాలు వర్తించేందుకు వీలుగా కౌలురైతుకు అందిస్తున్న కార్డును పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఉమాదేవి తెలిపారు. రైతు సేవా కేంద్రం వద్ద రైతు వివరాల దరఖాస్తు రూపంలో ఇవ్వాలన్నారు. కౌలు రైతు అర ఎకరం నుంచి ఎంతైనా భూమి సాగుచేసుకోవచ్చన్నారు. కార్డు కాలపరిమితి 11 నెలలు ఉంటుందన్నారు. ఫారం-1 నమోదు చేసిన పత్రం గ్రామ రెవెన్యూ అధికారి ఇవ్వాలన్నారు. కౌలు రైతు కార్డు పొందిన వారికి పంటల బీమా వర్తింపు, ప్రభుత్వం నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అమ్ముకునే అవకాశం, ప్రకృతి వైపరీత్యాల వల్లపంట నష్టం జరిగితే పరిహారం పొందే అవకాశం ఉంటుందని ఏవో వివరించారు. ఈ అవకాశాన్ని కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాయితీపై గోదాముల నిర్మాణం

చింతపల్లి, జూలై 29: గిరిజన రైతుల వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులు భద్రపర్చుకునేందుకు గోదాములు (సేకరణ కేంద్రం) నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 75 శాతం రాయితీ ఇస్తున్నదని మండల ఉద్యానవన శాఖాధికారి కంటా బాలకర్ణ తెలిపారు. మండల కేంద్రం బాలాజీ పేటలో వెలుగు ఆధ్వర్యంలో నిర్మించిన గోదామును సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతపల్లి, గూడెంకొత్తవీధి, జి.మాడుగుల మండలాల్లోనిపలు గ్రామాల్లో గోదాముల నిర్మాణం జరుగుతున్నదన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో పాటు రైతులకు వ్యక్తిగతంగా గోదాముల నిర్మాణాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. గోదాము నిర్మాణానికి రూ.15 లక్షల నిధులు ఖర్చవుతున్నట్టు అంచనా వేయడం జరిగిందన్నారు. ఈ నిధుల్లో రూ.11.25 లక్షలను ప్రభుత్వం రాయితీగా అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీవో నాయుడు పాల్గొన్నారు.

పారిశుధ్య పరిరక్షణతోనే వ్యాధుల నివారణ సాధ్యం

కొయ్యూరు, జూలై 29: పారిశ్యు పరిరక్షణతోనే వ్యాధుల నివారణ సాధ్యమని ఎంపీడీవో లాలం సీతయ్య స్పష్టం చేశారు. పారిశుధ్య వారోత్సవాల నిర్వహణ తీరును రావణాపల్లిల పంచాయతీలో సోమవారం పరిశీలించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి పిల్లల ఆరోగ్య విషయాలపై ఆరా తీశారు. అలాగే రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యం మెరుగుపరచడాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారు. ఇందుకు వీలుగా ఆరోగ్యవంతమైన గ్రామాన్ని రూపొందించుకునేందుకు అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం సచివాలయంలో రికార్డుల నిర్వహణ, ఓడీఎఫ్ సర్వే, పింఛన్ల పంపిణీపై తగిన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గంజాయికి దూరంగా ఉండాలి

చింతపల్లి, జూలై 29: గిరిజన యువకులు గంజాయికి దూరంగా ఉండాలని ఎస్ఐ అరుణ్‌కిరణ్ కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గంజాయి వల్ల కలిగే నష్టాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా చేస్తూ పట్టుబడితే జైలు జీవితం అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. గంజాయి నిందితులకు బెయిల్ కూడా సకాలంలో రాదన్నారు. ప్రస్తుతం చింతపల్లి మండలానికి చెందిన 470 మంది విశాఖ సెంట్రల్ జైలులో నిందితులుగా శిక్ష అనుభవిస్తున్నారన్నారు. స్మగ్లర్లు మద్యం, డబ్బులు ఎరగా చూపినా రవాణాకు సహకరించరాదన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కమ్మరితోటలో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

సీలేరు, జూలై 29: జీకే వీధి మండలం ధారకొండ పంచాయతీ కమ్మరితోట గ్రామంలో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో డయేరియాతో బాలిక మృతి చెందినట్టు పత్రికల్లో కథనాలు రావడంతో పంచాయతీ కార్యదర్శి స్పందించి కమ్మరితోట గ్రామానికి సిబ్బందితో వెళ్లి నీటి వనరులను క్లోరినేషన్ చేయించారు. అలాగే గ్రామంలో నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్, ఫినాయిల్ వంటివి చల్లారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాంబాబు, బీసీ సెల్ అధ్యక్షుడు బుజ్జి పాల్గొన్నారు.

పెద్దగెడ్డ-పెద్దూరు రోడ్డు నిర్మించరూ..

చింతపల్లి, జూలై 29: పెద్దగెడ్డ-పెద్దూరు రహదారి నిర్మించాలని టీడీపీ సీనియర్ నేత బేరా సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2018లో తెలుగుదేశం ప్రభుత్వం పెద్దగెడ్డ-పెద్దూరు రహదారి నిర్మాణానికి సుమారు రూ.2.5 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ టెండర్ రద్దు చేసిందన్నారు. దీంతో ఆదివాసీలకు రవాణా కష్టాలు తప్పడంలేదన్నారు. పలు మార్లు రహదారి నిర్మాణాలు పూర్తి చేయాలని గిరిజనులు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నియోజకవర్గం పరిధిలో రహదారుల నిర్మాణాలకు నిధులు విడుదల చేసేందుకు జిల్లా కలెక్టర్లకు ప్రతిపాదనలు కోరడం జరిగిందన్నారు. ఈ మేరకు జిల్లా అధికారులు పెద్దగెడ్డ-పెద్దూరు రహదారికి అధిక ప్రాధాన్యం ఇచ్చి నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో యర్రబొమ్మలు ఎంపీటీసీ సెగ్గె సత్యనారాయణ పాల్గొన్నారు.